
# ప్రకృతి విలపిస్తోంది



- పాండ్రంకి సుబ్రమణి

గొడ్డూ గోదా చూసుకొని పొలం పనులు ఓమారు పరకాయించి వచ్చి, చేతిలోని గిలకల కర్రను సావకాశంగా తాటిస్తూ నరసింహులు అటు వస్తున్నప్పుడు - ఆ ఇద్దరు యువకులూ ఆ మర్రిచెట్టు చుట్టూ కట్టి వున్న చప్టాపైన కూర్చుని హోరాహోరీగా మాట్లాడుతుంటారు. వాళ్లు మాట్లాడుకొనని విషయాలు, తర్కించని సంగతులు ఆకాశం క్రింద వుండవేమో!

అక్కడ కాసేపు నిల్చుని వాళ్ళు మాట్లాడుకునే విచిత్రమైన కబుర్లు వింటుంటే నరసింహులకు వున్న పలాన నవ్వు పుట్టుకొచ్చేది. లోకం పోకడ గురించి పరిసరాల పారిశుధ్యం గురించి ఆ కుర్రాళ్ళు కంగారుపడి పోతుంటారు. నరసింహులకు రాజకీయాలంటే అమితమైన ఆసక్తి. ఆ వూసు వాళ్ళు ఎత్తరంటే ఎత్తరు మరి. కాబట్టి అతనక్కడ ఎక్కువ సేపు నిలబడలేక పోయేవాడు. ఒకసారి వుండబట్టలేక అడిగేశాడు కూడాను - "మన దేశంలో, మన రాష్ట్రంలో అంతెందుకుమన వూళ్ళోనే ఎన్ని రాజకీయాలు లేవని! ఎన్ని పార్టీ వుడాయింపులు జరగడం లేదని! అవన్నీ మీకు రుచించవేమిటి?" అది విని వాళ్ళిద్దరూ కనుబొమలు ఎగరవేశారు. "రాజకీయ వాదులు వ్యాపారస్తులుగా మారాలనుకుంటున్నప్పుడు ఇక రాజకీయాల పోకడ ఎలా వుంటుందో వూహించేందుకు మనమంతగా శ్రమపడనవసరం లేదు బాబాయ్!" కిసుక్కున వచ్చింది ఆ బదులు. ఆ రోజు వాళ్ళు మరో ఇద్దరు కుర్రాళ్ళను కూడబెట్టుకొని నానాటికీ పాడయిపోతున్న ప్రకృతి పరిసరాల గురించి వాపోతున్నారు. "జార్జియా అడవుల్లో తదితర అమెరికన్ పట్టణాలలో యాసిడ్ వర్షం కురిసిందట" ఒకబ్బాయన్నాడు. వెంటనే రెండవ అబ్బాయి — "మైగాడ్ మొన్న మొన్న జర్మనీ నగరాలలో ద్రావక వర్షం కురిసి కార్లు సహితం కాలిపోయాయట"

అది విని నరసింహులు కిసుక్కున నవ్వేశాడు. కుర్రకాయలు ఉలిక్కిపడి చూశారు. 'మా మాటలు మీకు నవ్వులాటగా వున్నాయా?' ముక్తకంఠంతో అడిగారు. "కాకపోతే మరేవిటోయ్! అక్కడికి మీ నలుగురూ స్వయంగా అమెరికా, జర్మనీ వెళ్ళి వచ్చినట్టు మాట్లాడుతుంటే నవ్వు రాదేమిటి?"

"మేం స్వయంగా చూసి వుండకపోవచ్చు. కాని అలా జరగడం వాస్తవమే కదా! నిజం చెప్పాలంటే అది యాసిడ్ వర్షం కాదు బాబాయి గారూ! కెమికల్ ఫ్యాక్టరీలు, ప్రకృతి పరిసరాలలో చేస్తున్న బీభత్సానికి ఆకాశం విడుస్తున్న కన్నీరు."

"మీ బాధ నాకు అర్థమవుతూంది. కానీ ఎక్కడో జరుగుతున్న దానికి ఇంత ఇదయిపోతున్నారే - మన చుట్టూ గొప్ప గొప్ప రాజకీయ మార్పులు జరుగుతున్నాయి కదా, మరి వీటికి, మీరెందుకు స్పందించడం లేదు? ఆస్పత్రి పడకలో వున్న పొరుగూరి రాష్ట్ర ముఖ్యమంత్రిని, తేరుకునేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా బర్తరఫ్ చేసేశారు. మీకిది అన్యాయంగా తోచడం లేదా?" నలుగురూ వూరకుండిపోయారు నరసింహుల వేపు తేరిపార చూస్తూ - నిశ్శబ్దంగా నిట్టూర్పు విడుస్తూ.

మార్పులు రెండు రకాలు. కొన్ని త్వరగా ముంచుకువచ్చేవి - కొండ శిఖరం పైనుండి దొర్లు కుంటూ వచ్చే కొండరాళ్ళూ. మరి కొన్ని తరచుగా వచ్చేవి - కచ్చితమైన కాలక్రమాన కనిపించే ఋతుచక్రంలా పది రోజులు - పదే పది రోజులు నరసింహులు కుటుంబ సమేతంగా పుణ్య యాత్రల కోసం వూరు విడిచి వెళ్ళాడు. ఎన్ని మార్పులు! ఎన్ని దొమ్మీలు!

నరసింహులు ఊరు చేరిన ఉదయాన్నే అర్జంటు కబురొచ్చింది - రాబోయే ఎలక్షన్ల విషయమై పార్టీ ఎలక్షను కమిటీతో మంతనాలు జరిపేందుకు. ఏరియా పార్టీ మీటింగుకి రమ్మనమని. అతడలా బజారు రోడ్డమ్మట ఆదరాబాదరగా వెళ్తున్నప్పుడు పెద్ద గుంపు ... ఆ గుంపు మధ్య యమధర్మరాజు వాహనాల్లా రెండు పోలీసు వ్యానులు ఎదురు వచ్చాయి. తత్తర పాటుతో చూశాడు నరసింహులు. ఎలక్షను నోటిఫికేషను ఇంకా ప్రకటించనే లేదు, ఇంతలోనే దొమ్మీలు చెలరేగి పోయాయా!' నమ్మలేనట్లు కంగారుపడిపోతూ గుంపులోకి దూసుకువెళ్ళాడు. సుమారు పదిహేను మంది యువకులను వ్యానులోకి ఎక్కిస్తున్నారు. గుడ్లప్పగించి చూశాడు. కొందరు తమ వూరివాళ్ళే! మరి కొందరు పొరుగూరి కుర్రాళ్ళయి వుంటారు. "ఏమయిందేమిటి?" అడిగాడు. "రూలింగ్ పార్టీ మెంబరువి. ఇంత మాత్రం తెలీదేమిటి?" ఎవడో ఎక్స్ట్రా పార్టీ గాడి చురక. "తెలిస్తే చెప్పు. లేదా నోరు మూసుకో?" అని ఎస్.ఐ. గారి వద్దకు వెళ్ళి వాకబు చేశాడు. ఊరికి ఆవలివేపు కొండ ప్రక్క ప్రదేశంలో ఏదో కెమికల్ ఫ్యాక్టరీ కట్టేందుకు ఒక ఉత్తరాది వ్యాపార సంస్థకు కేంద్ర ప్రభుత్వం అనుమతి జారీ చేసిందట. అది గాని పడ్తే చెత్తా చెదారం ఊళ్ళోకి ప్రవేశించి, జీవరేఖ వంటి వాగు కాలుష్యమవుతుందని, భూగర్భ జలాలు సహితం విషతుల్యమవుతాయని - అందు చేత అది కట్టేందుకు ఏ మాత్రం వీలు లేదని ఊరి కుర్రజనం నిరాహార దీక్ష పూనారట. "రోడ్ రోకో" ప్రారంభించారట, అది విని

16-8-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక



హోటల్‌లో కూర్చున్న సుబ్బారావు చిరగ్గా ఓ సర్వర్‌ని పిలిచాడు.


"నువ్విక్కడ ఎంతకాలం నుంచి పని చేస్తున్నావ్"

"నెల రోజుల్నుంచి సార్"

"అయితే నేను దోసె ఆర్డరిచ్చింది నీ క్కాదన్న మాట" నిట్టూర్చాడు సుబ్బారావు.

- గొల్లపూడి శైలజ





నరసింహులు ఘుక్కుపైన చేయి వేసుకున్నాడు. అవ్వ! ఎంతటి మొండి ధైర్యం! వీళ్ళ తెలివితేటలు మండిపోనూ - నూరు మందికి ఉద్యోగాలిప్పించే ఫ్యాక్టరీని కట్టవద్దని ఆపుచేయడమా? ఇక్కడ గాని ఆ ఫ్యాక్టరీ లేహొస్తే ఊరు ఊరంతా నగరంగా మారిపోదూ! అభివృద్ధి నిరోధకులు - సాంప్రదాయవాదులు. ''వీళ్ళకు ఇది కావల్సిందే'' నరసింహులు ఈసడించుకుంటూ, చేతి గుడ్డ దులుపుకుంటూ వెళ్ళిపోయాడు.

రోజులు దొర్లిపోయాయి.

ఊళ్ళోని యువక జనం పల్చబడ్డారు. కొందరు యువ పౌరులుపై చదువుల కోసం కాలేజీలు వెతుక్కుంటూ పొరుగూళ్ళకు తరలిపోయారు. మరి కొంతమంది అర్థాంతరంగా చదువులు చాలించి బ్రతుకు బాటకు రేఖలు దిద్దుకుంటూ నిరుద్యోగానికి నైవేద్యం అర్పిస్తూ పట్టణాల పొలిమేర చేరుకున్నారు. ఇంకా కొద్ది మంది పోలీసు కేసుల నుండి విడివడి పుట్టిన ఊరులో వుండడం ఇక తగదని తేల్చుకొని కను మరుగయ్యారు.

మూడు రోజులుగా కురుస్తోన్న వర్షం ఆ రోజు కాస్తంత తగ్గుముఖం పట్టింది. లేత ఎండ పల్చటి బంగారు పరదాలా వూరిపైన వాలింది. పెద్దలూ చిన్నలూ మనసా వాచా ఒక్కటయ్యారు. గుంపులుగుంపులుగా వీథుల్లోకి వచ్చేశారు - దుప్పట్లూ, చీరెలూ, దోమతెరలూ చుట్టుకొని! నరసింహులు భార్య అందించిన ముంత కాఫీ అంది పుచ్చుకొని వీథిలోకి వచ్చి నిర్మలమైన ఆకాశంలోకి ఆనందంగా అమాయకంగా చూస్తూ కొంచెం కొంచెంగా నోట్లో పోసుకుంటున్నాడు. అంతటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని హడలు కొట్టించేస్తూ, ఒక్క వుదుటున పంచాయతీ మండపం దాటుకుంటూ పాపిగాడు అరుస్తూ వస్తున్నాడు. నరసింహులు కనురెప్పల్ని ఆడిస్తూ తిరిగి చూశాడు. అరె, పాపిగాడే! ఏమయింది! నరసింహులు ఆశ్చర్యం నుండి తేరుకునే లోపల పాపిగాడు రొప్పుకుంటూ వచ్చేశాడు. ఏమయిందన్నట్లు నరసింహులు ప్రశ్నార్థకంగా చూశాడు. ఊపిరి అందుకునేందుకు యమయాతన పడుతూ ''గొడ్డూ గోదా చచ్చి పడుతున్నాయి దొరా'' అని దుఃఖిస్తూ చెప్పాడు.

''యాళ్ళ గొడ్డూ గేదారా?''


'''మనవీ-ఊరాళ్ళవీ''' కొన్ని క్షణాలు నరసింహులు ఊపిరి పీల్చడం మరచి గుడ్లు పెద్దవి చేసుకొని చూస్తూ వుండిపోయాడు. చేతిలోని కాఫీ ముంత జారిపడేలోపల భార్య అందిపుచ్చుకుంది.

ఆ రోజు వూరంతటనూ శ్మశానపు వాతావరణం పేర్కొంది. అన్నపానాలు మాని పూజా పునస్కారాలు మరచి వూరి జనం చెరువు గట్టున చేరుకుంది. ఎనుములూ, ఆవులూ! బర్రెలూ చెరువు గట్టున వరసగా చచ్చిపడి వున్నాయి. అక్కడక్కడ గాడిదలు కూడా కనిపించాయి. ఆ రోజు వూరి చరిత్ర శిలాక్షరాలతో లిఖించదగ్గ రోజు. చిన్నా, పెద్ద, ధనవంతులూ పేదలూ, స్త్రీ పురుషు భేదం లేకుండా వూరి జనమంతా ఒకే చోట చేరి, ఒకేసారి కన్నీరు విడిచిన రోజు.

రెప్పలు వాల్చకుండా చూస్తూన్న నరసింహులుకు ఇంకా అదంతా ఓ కలగానే కనిపిస్తూంది - అతడి కళ్ళు ఆ దృశ్యాన్ని నమ్మడానికి తిరస్కరిస్తున్నాయి. నరసింహులు భార్య అతడి భుజాన చేయి వేసి మాటి మాటికీ కళ్ళు తుడుచుకుంటూంది ఆ వూళ్ళో చాలామంది ''ఇదిగో వెళ్తున్నాం, అదిగో చేసుకొస్తున్నాం'' అంటూనే ఎనిమల్స్ని, ఆవుల్నీ ఇన్సూర్ చేయకుండా వుండి పోయారు. గోరు చుట్టుకి రోకలి పోటు!

డిస్ట్రిక్టు రెవిన్యూ డిపార్టుమెంటువారి ఆధ్వర్యాన విశేషమైన రసాయనిక పరీక్షలు జరిగాయి. పలు నిపుణులు, పలు కోణాల నుంచి జరిపిన విశ్లేషణ వల్ల తేలిన విషయం — ''చెరువు పొల్యూట్ అయిన విషయం వాస్తవమే! అలా ఆ చెరువు 'పొల్యూట్' అవడానికి దారి తీసిన రసాయనిక ద్రవ్యాలలో కాస్తంత సైనాయిడ్ ఎలిమెంట్సు కలిసి వుండడం కూడా వాస్తవమే''! అది విని వూళ్ళోని పెద్దలు ముక్కులపై వేళ్ళు పెట్టుకున్నారు. నమ్మలేనట్లు ఆకాశంలోకి దీర్ఘంగా చూస్తుండిపోయారు. ''ఊళ్ళోని కెమికల్ ఫ్యాక్టరీ లేవనే లేదు కదా! మరి అంతలోనే చెరువు కాలుష్యం అయిపోవడమేమిటి?'' రెవిన్యూ డిపార్టుమెంటు వారు జంకారు. మళ్ళీ ఏవిధమైన రగడ బయల్దేరుతుందోనని. ఎన్విరోన్‌మెంటల్ నిపుణుల్ని పిలిపించి మరింత దీర్ఘమైన పరీక్షలు జరిపించారు. అండ పిండ బ్రహ్మాండం బయట పడింది. ఊరికి సుమారు యాభై కిలోమీటర్ల దూరాన వున్న ఓ నగరంలో ఓ కెమికల్స్ ఫ్యాక్టరీ. ఆ ఫ్యాక్టరీ వాళ్ళు నిర్లక్ష్యంగా విడిచేసిన చెత్తాచెదారం నూనె రూపంలోకి మారి భారీగా కురిసిన వర్షపు నీళ్ళలో కలిసి కొట్టుకుంటూ వచ్చి చెరువును తాకింది. అటువంటి కాలుష్యపు నూనె వల్ల చెరువు నీళ్ళూ, బావి నీళ్ళూ మాత్రమే కాదు - భూగర్భ జలాలు సహితం విషతుల్యమవుతాయట. ఈ విషయమై ఎన్విరోన్‌మెంటల్ బోర్డు వాళ్ళు ఫ్యాక్టరీ మేనేజిమెంటుకి చాలా హెచ్చరికలే విడిచారట. ఉవ్వెత్తున పెరిగిపోయిన వార్నింగ్ మెమోల ఫైలుని బోర్డు వాళ్ళు ఎంక్వయిరీ కమిటీ ముందు వుంచారట.

రిపోర్టులోని సారాంశం విన్న వూరిపెద్దలకూ, ఇంటి గుమ్మాలు దాటెరుగని ఇల్లాండ్లకూ ఆ రోజంతా పోలీసు వ్యానులోకి ఎక్కి కూర్చున్న యువకుల ముఖాలే కనిపించాయి. లాఠీ దెబ్బలు తిన్నవాళ్ళ శరీరాలే కళ్ళ ముందు మెదిలాయి. ఎక్కడో వున్న కెమికల్ ఫ్యాక్టరీ వల్ల అంత నష్టమయితే, మరి ఇక్కడ లేహొస్తున్న ఫ్యాక్టరీ వల్ల...!



''ఈ రోజు దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉందా. నీకేం తెలుసు?'' ఒక బిచ్చగాడు అడిగాడు వేరొక బిచ్చగాడ్ని.

''నాకీ రోజు ఏం పైసలు రాలేదు కాబట్టి'' విచారంగా చెప్పాడు బిచ్చగాడు.

— పద్మశ్రీ, మాణిక్యారం